**ఆకాశవాణి విజయవాడ కేంద్రం**

ప్రాంతీయ వార్తా విభాగం

**ప్రాంతీయ వార్తలు**

**తేది : 18-08-2024** **సమయం : 1.20 గంటలు**

---

**ముఖ్యాంశాలు**

1. **సమాజంలో ప్రతి ఒక్కరూ నైపుణ్యాలను పెంపొందించుకోవాలని కేంద్ర గ్రామీణాభివృద్ధి కమ్యూనికేషన్ల శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ సూచించారు.**

2. **పునరుత్పాదక ఇంధన ఉత్పత్తిలో ఆంధ్ర ప్రదేశ్ కు గ్రీన్ ఎనర్జీ పురస్కారం లభించింది.**

3. **సమృద్ధిగా కురిసిన వర్షాలతో రాష్ట్ర వ్యాప్తంగా జలాశయాలు పూర్తి జలకళ సంతరించుకున్నాయి.**

4. **రాజధాని అమరావతికి రుణం మంజూరు అంశంపై ప్రపంచ బ్యాంకు బృందం రేపటి నుండి అమరావతిలో విస్తృతంగా పర్యటించనున్నది.**

5. **ముఖ్య మంత్రి ఎన్. చంద్రబాబు నాయుడు అధ్యక్షతన రాష్ట్ర మంత్రివర్గ సమావేశం ఈ నెల 28 వ తేదీన జరుగుతుంది.**

==========================

సమాజంలో ప్రతి ఒక్కరూ నైపుణ్యాలను పెంపొందించుకోవాలని కేంద్ర గ్రామీణాభివృద్ధి ...., కమ్యూనికేషన్ల శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ పిలుపు నిచ్చారు. గుంటూరు పట్టణంలో ఈ రోజు జరిగిన సేవా మహోత్సవ కార్యక్రమంలో పాల్గొని ఆయన లబ్ధిదారులకు కుట్టు మిషన్లు ...,.పిండి మిషన్లు అందజేశారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి మాట్లాడుతూ ....నైపుణ్యాలను పెంపొందించుకోవడం ద్వారా మాత్రమే మనం అభివృద్ధి సాధించగలమని సూచించారు. నైపుణ్యాలను పెంపొందించుకోవడానికి కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అనేక కార్యక్రమాలను అందిపుచ్చుకుని ప్రజలు జీవితంలో రాణించాలని డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ సూచిసూ

------------------------

పునరుత్పాదక ఇంధన ఉత్పత్తిలో మెరుగైన పనితీరు సాధించినందుకు ఆంధ్ర ప్రదేశ్ కు గ్రీన్ ఎనర్జీ ఛాంపియన్ పురస్కారం లభించింది. 2023 – 24 సంవత్సరానికి సంబంధించి ఆంధ్ర ప్రదేశ్ ను గ్రీన్ ఎనర్జీ ఛాంపియన్ గా ఇండియన్ విండ్ పవర్ అసోసియేషన్ ప్రకటించింది. తమిళనాడు రాష్ట్రంలోని కోయంబత్తూరు వేదికగా నిన్న జరిగిన ఈ అసోసియేషన్ సమావేశంలో ఆంధ్ర ప్రదేశ్ ఈ పురస్కారం అందుకుంది. కేంద్ర నూతన పునరుత్పాదక ఇంధన శాఖ సంయుక్త కార్యదర్శి లలిత్ బోహ్రా నుండి ఆంధ్ర ప్రదేశ్ సోలార్ పవర్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ ఎం. కమలాకర్ బాబు ఈ పురస్కారాన్ని అందుకున్నారు. ఆంధ్ర ప్రదేశ్ కు గ్రీన్ ఎనర్జీ ఛాంపియన్ పురస్కారం లభించడం పట్ల

రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. సంబంధిత ఉన్నతాధికారులను మంత్రి అభినందించారు.

-----------------------------

ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు రెండు రోజుల డిల్లీ పర్యటన ఈ రోజు ముగిసింది. కొద్దీ సేపటి క్రితం ఆయన డిల్లి నుండి అమరావతి బయలు దేరారు. ఈ రెండు రోజుల డిల్లి పర్యటనలో ఆయన ప్రధాన మంత్రి నరేంద్ర మోడీతో సహా ఐదుగురు కేంద్ర మంత్రులను కలుసుకుని రాష్ట్రాభివృద్ధికి సంబంధించిన అంశాలపై చర్చలు జరిపారు.

-----------------------------

రాష్ట్ర వ్యాప్తంగా జలాశయాలు జలకళ సంతరించుకున్నాయి. శ్రీశైలం జలాశయంలో 215 టి.ఎం.సి. లకు గానూ తాజాగా 195.21 టి. ఎం. సి. ల నీరు నిల్వ ఉంది. ఈ జలాశయానికి ఎగువ ప్రాంతం నుండి 86 వేల 517 క్యూసెక్కుల నీరు వస్తుండగా ..., దిగువన నాగార్జునసాగర్ జలాశయానికి ఒక లక్షా 972 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నారు. నాగార్జున సాగర్ కు చేరుతున్న వరద నీటిలో 63 వేలకు పైగా క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు.మరొక వైపు ... పులిచింతల ప్రాజెక్టు గరిష్ట నీటి నిల్వ 45.77 టి.ఎం.సి.లకు గానూ 44.69 టి.ఎం సి. ల నీరు నిల్వ ఉంది. విజయవాడ ప్రకాశం బ్యారేజ్ లో గరిష్ట నీటి నిల్వ 3.07 టి.ఎం.సి. లకు గాను అంటే మొత్తంలో నీటి నిల్వలు కొనసాగుతున్నాయి. ప్రకాశం బ్యారేజ్ లోకి 32 వేల క్యూసెక్కుల నీరు వస్తుండగా ..., 32 వేల 226 క్యూసెక్కుల నీటిని కిందకు విడుదల చేస్తున్నారు. మరొక వైపు .... తూర్పు గోదావరి జిల్లా ధవళేశ్వరం వద్ద గోదావరి నదిపై ఉన్న సర్ ఆర్థర్ కాటన్ బ్యారేజి గరిష్ట నీటి నిల్వ 2.93 టి.ఎం.సి. లకు గానూ అదే స్థాయిలో నీరు కొనసాగుతోంది. గత రెండేళ్లలో వర్షా భావంతో ఇబ్బందులు ఎదుర్కొన్న రాష్ట్రానికి జలాశయాల నీటి నిల్వ పరిస్థితి ఊరట కలిగిస్తోంది.

-----------------------------

అమరావతిలో వచ్చే 2027 సంవత్సరంలో జాతీయ క్రీడలు నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని విజయవాడ లోక్ సభ సభ్యులు కేశినేని శివనాథ్ తెలిపారు. విజయవాడలో ఈ రోజు జరిగిన ఒక కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ..... గుంటూరు జిల్లా మంగళగిరిలో ఉన్నత ప్రమాణాలు కలిగిన క్రికెట్ స్టేడియం ను ఆరు నెలల్లో ప్రారంభిస్తామని చెప్పారు. విజయవాడలో క్రికెట్ అకాడమీ ఏర్పాటుకు కూడా చర్యలు తీసుకుంటామని కేశినేని శివనాథ్ పేర్కొన్నారు. విజయవాడ తూర్పు నియోజక వర్గ శాసన సభ్యుడు గద్దె రామ్మోహన్ కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

-----------------------------

రాష్ట్ర రాజధాని అమరావతి నిర్మాణానికి రుణం మంజూరుకు సంబంధించిన అంశాలను పరిశీలించడానికి ప్రపంచ బ్యాంకు ...., ఆసియా అభివృద్ధి బ్యాంకు ...ADB... లకు చెందిన ఉన్నత స్థాయీ బృందం రేపటి నుండి రాజధానిలోని వివిధ ప్రాంతాలలో విస్తృతంగా పర్యటించనున్నది. ఈ నెల 27 వ తేదీ వరకూ జరిగే ఈ పర్యటనలో భాగంగా రుణం మంజూరుకు సంబంధించిన వివిధ అంశాలపై రాష్ట్ర ప్రభుత్వం ...., రాజధాని ప్రాంత ప్రాధికార అభివృద్ధి సంస్థ ....CRDA... అధికారులతో పలు అంశాలపై చర్చిస్తుంది. ఈ నెల 10 నుండి 12 వ తేదీ వరకు ప్రపంచ బ్యాంకు బృందం మొదటి విడత పర్యటన జరుగగా .... రేపటి నుండి రెండవ విడత పర్యటన జరుగుతుంది.ముఖ్య

మంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన ఈ నెల 27 వ తేదీన జరగవలసిన రాష్ట్ర మంత్రివర్గ సమావేశం ఆ మరుసటి రోజు 28 కి వాయిదా పడింది. 28 వ తేదీన వెలగపూడి సచివాలయంలో ఉదయం 11 గంటలకు మంత్రివర్గ సమావేశం జరుగుతుందని రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు .... ప్రధాన కార్యదర్శులు .... ఆయా విభాగాలకు సంబంధించిన అంశాలపై పూర్తి వివరాలతో సిద్ధం కావాలని ప్రభుత్వం ఆ ఉత్తర్వుల్లో పేర్కొంది.

--------------------------

శ్రావణ పౌర్ణమి పురస్కరించుకుని విజయవాడ శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి దేవస్థానం ఆధ్వర్యంలో రేపు గిరి ప్రదక్షిణ జరుగుతుందని ఆలయ కార్యనిర్వహణాధికారి కె.ఎస్. రామారావు తెలిపారు. రేపు ఉదయం 5 గంటల 55 నిమిషాలకు ఘాట్ రోడ్డులోని కామధేను అమ్మవారి ఆలయం వద్ద గిరి ప్రదక్షిణ ప్రారంభమై కుమ్మరిపాలెం ...., నాలుగు స్తంభాల సెంటర్ ...., సితార ...., కబేళ....,.పాల ఫాక్టరీ ...., మెదలైన ప్రాంతాల మీదుగా ఏడు కిలోమీటర్ల పొడవున గిరి ప్రదక్షిణ కొనసాగి .... ఉదయం 9 గంటలకు మహా మండపం వద్దకు చేరుతుందని ఆయన ఒక ప్రకటనలో తెలిపారు.

--------------------------

కేంద్ర ప్రభుత్వం చేపట్టిన స్వచ్ఛభారత్ కార్యక్రమం సమాజాన్ని స్వచ్ఛత దిశగా ముందుకు నిడిపిస్తోంది. ఈ కార్యక్రమ స్ఫూర్తితో అనేక సంస్థలు,ప్రభుత్వ కార్యాలయాలు విభిన్నమైన కార్యక్రమాలను చేపడుతున్నాయి. వీటిలో భాగంగా ఈ రోజు గుంటూరు నగరంలోని ప్రభుత్వ ప్రాంతీయ గ్రంధాలయంలో పరిసరాల పరిశుభ్రత కార్యక్రమాన్ని నిర్వహించి, మొక్కలను నాటారు. జిల్లా అటవీశాఖాధికారి పోతురాజు ముఖ్య అతిధిగా హాజరైన ఈ కార్యక్రమంలో మానవత అనే స్వచ్ఛంద సంస్థ సభ్యులు, నల్లపాడు లోని MBTS పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు పాల్గొని, ప్రాంతీయ గ్రంధాలయ ఆవరణను శుభ్రం చేశారు. కార్యక్రమంలో పౌర గ్రంధాలయ శాఖ ఉపసంచాలకులు సి.హెచ్.దీక్షితులు తదితరులు పాల్గొన్నారు.

--------------------------

ప్రజల ఆరోగ్య సంరక్షణ కోసం వైద్య రంగంలో ప్రభుత్వ ...., ప్రైవేటు ...., ప్రజల భాగస్వామ్య విధానాన్ని అమలు చేయవలసిన అవసరం ఉందని ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. ఆంధ్ర ప్రదేశ్ మెడ్ టెక్ జోన్ ...AMTZ.. ఆధ్వర్యంలో విశాఖపట్నంలో మూడు రోజుల పాటు జరిగిన భారత్ ఆఫ్రికా మెడ్ టెక్ సదస్సులో నిన్న ఆయన వర్చువల్ గా ముగింపు ఉపన్యాసమిస్తూ .... వైద్య ..., ఆరోగ్య రంగంలో గణనీయమైన పురోగతి సాధించేందుకు సమాజంలోని అన్ని వర్గాలను సమన్వయం చేసుకుంటూ ముందుకు వెళ్లాలని రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యం నిర్దేశించుకుందని చెప్పారు. భారత్ ఆఫ్రికా దేశాలలో వైద్య రంగంలో నెలకొన్న సవాళ్లను పరిష్కరించడానికి ...., ప్రపంచ లక్ష్యాలను సాధించడానికి పరస్పర సహకారంతో ముందుకు వెళ్లాలని ఈ సందర్భంగా చంద్ర బాబు నాయుడు సూచించారు.

--------------------------

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే “మన్ కీ బాత్” మనసులోని మాట కార్యక్రమం 113వ సంచిక ఈనెల 25వ తేదీ

ఆదివారం ప్రసారమవుతుంది."మన్ కీ బాత్" కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు, సలహాలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 నెంబర్‌కు ఈనెల 23వ తేదీ సాయంకాలం వరకు పంపవచ్చు.

---------------------------

పోలవరం ప్రాజెక్టు కార్యాలయాన్ని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ ఈ రోజు సందర్శించారు. కార్యాలయానికి సంబంధించిన కొన్ని దస్త్రాలు అక్కడ దగ్ధమైన ప్రదేశాన్ని పరిశీలించారు. ఈ ఘటన విషయంలో నిర్లక్ష్యంగా ఉన్న సిబ్బందిపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ అంశంపై పూర్తి స్థాయి విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను మంత్రి కందుల దుర్గేష్ ఆదేశించారు.

======================